క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన హౌసింగ్ పీడీ



ఎమ్మిగనూరుటౌన్: జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి ఆదివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో హౌసింగ్ పురోగతి, బిల్లుల చెల్లింపులు తదితర అంశాలపై పీడీతో ఎమ్మెల్యే చర్చించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి హౌసింగ్ పురోగతిపై చర్చించారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

హాలహర్వి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధి సాధ్యపడిందని ఎంపీపీ నెట్టికంఠమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారం, డ్రెయినేజీ కాలువల ఏర్పాటు చేస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లుతున్నారన్నారు. విద్యార్థులకు అమ్మ ఒడి, పొదుపు మహిళలకు జగనన్న చేయూత, అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు అందరికీ పింఛన్లు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు, ఇటు గ్రామాల అభివృద్ధి చెందడంతో అన్నివర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వైస్ ఎంపీపీ నగేష్, ఎంపీటీసీలు గోపాల్, గాదిలింగప్ప, భారతి, గంగమ్మ, సర్పంచులు బాపురం నాగేంద్ర, మల్లి, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లే పశువులకు ఆహారం



ప్లాస్టిక్ కవర్లను తింటున్న ఆవు

మద్దికెర: మండల కేంద్రంలోని ప్రధాన బజారులో కొందరు నడిరోడ్డుపై చెత్త, ప్లాస్టిక్ వేస్తున్నారు. దీంతో పశువులు ప్లాస్టిక్ కవర్లను తింటూ అనారోగ్యం, మృత్యువాత పడుతున్నాయి. ఆహార పదార్థాలు కొద్దిగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను దారిలో వేయడం వల్ల మూగజీవాలు వాటిని మృత్యువాత పడుతున్నాయని పలువురు జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయాన్నే ఆవుకు పూజలు చేసే వారు వీధుల్లో ప్లాస్టిక్ కవర్లను చూసి కలత చెందుతున్నారు. పంచాయతీ వారు ఉదయం శుభ్రం చేస్తున్నా అవగాహన లేకపోవడం, చెత్త కుండీ లేకపోవడంతో రోడ్డుపై చెత్తను వేస్తున్నారు. దీంతో చెత్త డ్రైనేజీలో పడి నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతూ దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అంతేగాక ఆ దారి వెంబడి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ప్రజలకు అవగాహన కల్పించాలనిజంతుప్రేమికులు కోరుతున్నారు.

పంట నమోదు తప్పనిసరి



పంట నమోదు చేస్తున్న వీఏఏ తస్లీమా

హొళగుంద: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని చిన్నహ్యాట ఆర్బీకే వీఏఏ తస్లీమా సూచించారు. ఆదివారం చిన్నహ్యాట గ్రామ పరిధిలో రైతుల పొలాల్లో ఈ–క్రాప్ బుకింగ్ చేసిన ఆమె మిగతా రైతులకు అవగాహన కలిగించారు. ఈ క్రాప్ నమోదు చేయించుకుంటే పంటల బీమా, నష్ట పరిహారం తదితర ప్రభుత్వ రాయితీలు, పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే రుణాల ప్రణాళిక, వ్యవసాయ ప్రణాళిక తదితర వాటికి పంటల నమోదు తోడ్పడుతుందని చెప్పారు. ఈ–క్రాప్ నమోదు చేయించుకునేందుకు రైతులు పొలం వన్‌బీ, బ్యాంకు ఖాతా బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు ఈ పంట నమోదు దరఖాస్తు పూరించి ఇవ్వాలని సూచించారు.

నేడు విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో లక్ష్మిచెన్నకేశవ స్వామి, వీరాంజనేయ స్వామి, పార్వతి పరమేశ్వర స్వామి దేవాలయాల ముందు ధ్వజస్తంభాలు, నాగదేవతల విగ్రహాలు, ఊరువాకిలి ప్రతిష్ట ఉత్సవాలు రెండు రోజులుగా గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నూతన విగ్రహాలకు జలాధివాసం నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పురోహితులు హోమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 11:40 గంటలకు విగ్రహాలు, ధ్వజస్తంభాలు, ఊరువాకిలి ప్రతిష్ట నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- వేగవంతంగా రోడ్ల నిర్మాణం
- తీరిన ప్రయాణ కష్టాలు



నాడు- లింగంపల్లి రోడ్డు దుస్థితి (ఫైల్)



నేడు- అద్దంలా మెరుస్తున్న తారు రోడ్డు



ఎల్లార్తి-ఆలూరు రోడ్డు



సమ్మతగేరి రోడ్డు



హెబ్బటం- పెద్దగోనెహాళ్ రోడ్డు

హొళగుంద: ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన పల్లె రోడ్లు కొత్త రూపు తెచ్చుకుంటున్నాయి. నిత్యం ప్రయాణంలో నరకం చూసే పల్లె ప్రజలకు త్వరలోనే కష్టాలు తీరనున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారు.

దశాబ్దాలుగా పట్టించుకునే నాథుడే కరువు

ఆంధ్రా-కర్ణాటక సరిహద్దులో ఉన్న హొళగుంద మండలంలోని గ్రామీణ రోడ్ల గురించి దశాబ్దాల కాలంగా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం తర్వాత నాలుగేళ్ల కాంగ్రెస్ పాలనలో ఎల్లార్తి–ఆలూరు రోడ్డు మినహాయించి ఆ తర్వాత ఐదేళ్ల టీడీపీ పాలనలో ఒక్క రోడ్డు కూడా బాగు పడలేదు. వారి పాలనలోనే ఉపాధి హామీ నిధుల కింద కొన్ని పల్లె రోడ్లు మరమ్మతు పనులు చేపట్టి నిధులు లేకనో లేదా పనులు చేయకుండా బిల్లులు చేసుకున్నారో ఏమో గానీ పనులు మాత్రం అర్ధాంతరంగా ఆగిపోయాయి. నేడు ఆ రోడ్లను అన్నింటినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాగు చేస్తూ ప్రజల ప్రయాణానికి ఇబ్బంది లేకుండా చేస్తోంది.

అభివృద్ధి దిశగా పల్లె రోడ్లు

2014–19 వరకు పాలన సాగించిన టీడీపీ ప్రభుత్వం మండలంలోని పల్లె రోడ్లను పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులను మంజూరు చేసి రోడ్లను బాగు చేయించింది. ఇప్పటికే రూ.2.50 కోట్ల ఎన్‌డీబీ నిధులతో హొళగుంద – ఆలూరు వయా ఎల్లార్తి పంచాయతీ రాజ్ రోడ్డు, హెబ్బటం – పెద్దగోనెహాళ్, లింగంపల్లి, కోగిలతోట, ఎల్లార్తి–ఆలూరు, సమ్మతగేరి, పెద్దహ్యాట రోడ్డు పనులు పూర్తయ్యాయి. త్వరలో ఆంధ్రా–కర్ణాటకకు వారధిగా ఉన్న మార్లమడికి గ్రామానికి 5 కి.మీ మేర రోడ్డు పనులు మొదలయ్యే అవకాశాలున్నాయి.

మంత్రి చొరవతో పరిష్కారం

చాలా ఏళ్లుగా రోడ్ల సమస్యతో బాధ పడుతున్న మండల ప్రజల కష్టాలు తెలిసిన నేత గుమ్మనూరు జయరాం అప్పటి టీడీపీ ప్రభుత్వం, జిల్లాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. దీనిపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించ లేదు. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మగారాల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మనూరు జయరాం ప్రత్యేక చొరవతో కొత్తగా రోడ్లు వేసేందుకు గ్రీన్ సిగ్నల్ పడడంతో పాటు నిధులు కూడా మంజూరయ్యాయి. చాలా రోడ్ల పనులు ఇప్పటికే పూర్తి కాగా మరికొన్ని రోడ్ల పనులు త్వరలో మొదలు కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు బాగు పడ్తుండడంతో మండల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు చెప్తున్నారు.

నిధుల మంజూరు వివరాలు...

- 5 కి.మీ కోగిలతోట రోడ్డుకు రూ.1.85 కోట్లు
- హొళగుంద–మార్లమడికి రోడ్డు 5.10 కి.మీలకు రూ.2.60 కోట్లు
- హెబ్బటం–ఇంగళదహాళ్ రోడ్డు 3 కి.మీలకు రూ.1.85 కోట్లు
- వందవాగిలి రోడ్డులో గాదిలింగప్ప గుడి నుంచి గ్రామంలోకి 1 కి.మీకు గాను రూ.55.87 లక్షలు
- హొళగుంద, మార్లమడికి క్రాస్ నుంచి నాగరకణ్వి, హొన్నూరు వరకు 5.10 కి.మీ రోడ్డుకు రూ.2.65 కోట్లు
- సమ్మతగేరిరోడ్డు 1.9 కి.మీలకు రూ.1.20 కోట్లు
- పెద్దహ్యాట రోడ్డు 1.35 కి.మీకు గాను రూ.77.40 లక్షలు
- ముగుమానుగుంది రోడ్డు 1 కి.మీకు రూ.62.36 లక్షలు
- హొళగుంద నుంచి హొన్నూరు కొట్టాల 6 కి.మీ రోడ్డుకు రూ.3.67 కోట్లు మంజూరయ్యాయి.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళమల్లేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో శ్రావణమాసం రెండవ ఆదివారం కావడంతో మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, అర్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కొందరు భక్తులు సింహాసన కట్ట నుంచి కొండ పైనున్న ఆలయం వరకు మెట్టు మెట్టుకు దీపాలు వెలిగించి భక్తిని చాటుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

వచ్చే నెలాఖరుకల్లా 'నగరడోణ' పూర్తి

ఆలూరు: సెప్టెంబర్ నెలాఖరుకల్లా చిప్పగిరి మండలం నగరడోణ గ్రామ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను సంబంధిత కాంట్రాక్టర్ చేత పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని హెచ్ఎల్‌సీ డీఈ మంజునాథ్ తెలిపారు. ఇప్పటికే దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కొన్ని అనివార్య కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగిందన్నారు. రిజర్వాయర్ రివిట్‌మెంట్, డీపీ, కట్ట పనులు పూర్తి చేశామన్నారు. కాలువలు, డీపీలు, చెరువు అంతర్ భాగంలో కొన్ని పనులు చేయాల్సి ఉందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రిజర్వాయర్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

జయప్రదం చేయండి

మద్దికెర: రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ వరకు చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు హనుమప్ప, సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. ఆదివారం మద్దికెరలో ప్రచార యాత్రకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రంలో నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు బస్సు యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. ఈ నెల 17వతేదీ విశాఖపట్నంలో ప్రారంభించి సెప్టెంబర్ 8వ తేదీన తిరుపతిలో జరిగే బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీపీఐ నాయకులు రంగస్వామి, వీరాంజనేయులు,రామాంజనేయులు ఉన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



నమూనా ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న గోనెగండ్ల మోడల్ స్కూల్ విద్యార్థినులు

గోనెగండ్ల: ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రాంలో భాగంగా గతేడాది ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో గోనెగండ్ల ఏపీ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు ఉత్తమంగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ ఆదివారం తెలిపారు. ఈనెల 28, 29, 30 తేదీలలో రాష్ట్రస్థాయిలో విజయవాడలో జరగబోయే బూట్ మరియూ గ్రాండ్ ఫినాలేకు తమ పాఠశాల విద్యార్థులు హాజరై సైన్స్ ప్రాజెక్టును ప్రదర్శించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.నమూనా ప్రాజెక్టును రూపొందించిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు స్రవంతి, అస్మంజు, సంధ్య, రాధిక, రాయినా అప్పనాలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీ, మోడల్ స్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారిణి సునీత

పత్తికొండ రూరల్: స్థానిక కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్‌ను సమగ్ర శిక్ష జిల్లా బాలిక శిశు అభివృద్ధి అధికారిణి సునీత ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారంగా భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంపై నిర్వాహకులపై మండిపడ్డారు. కూరగాయలను కడగకుండా వండేందుకు సిద్ధం చేస్తున్న సిబ్బందిని మందలించారు. కూరగాయలను శుభ్రంగా కడిగిన తరువాతనే వంటకు ఉపయోగించాలని, వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పెద్దమ్మవ్వ ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న పెద్దమ్మవ్వ

పత్తికొండ రూరల్: స్థానిక ఉప్పరకట్ట వద్ద కొలువైన పెద్దమ్మవ్వ 13వ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి ముస్తాబు చేశారు. అర్చకుడు ప్రసాద్ అమ్మవారికి గణపతిపూజ, సహస్రనామార్చన, పంచామృతాభిషేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్‌చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి దంపతులు, ఎంపీపీ నారాయణదాస్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

నాటుసారా స్వాధీనం

హొళగుంద: ఎల్లార్తి గ్రామ శివారులో ఆదివారం ఓ వ్యక్తి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు. నెరణికి తండాకు చెందిన టాక్రనాయక్ ఎల్లార్తి వద్ద నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించారని, నిందితుడు సారాను అక్కడే వదిలి పరారైనట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

హంద్రీ - నీవా నీటిని విడుదల చేయాలి

కృష్ణగిరి: హంద్రీ – నీవా సుజల స్రవంతి కాలువ నీటిని మండలంలోని కంబాలపాడు నుంచి పుట్లూరు, చెరుకులపాడు, తొగర్చేడు, టి.గోకులపాడు గ్రామాల మీదుగా వెళ్లే పాల హంద్రీకి వదిలితే వందలాది మంది రైతులకు ప్రయోజనం ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో హంద్రీ నదిలోని బోర్లన్నీ అడుగంటిపోయాయని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని హంద్రీనీవా నీటిని పాల హంద్రీకి విడుదల చేసి, వేల ఎకరాల్లోని పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





కృష్ణగిరి సమీపంలో వాడుముఖం పట్టిన వేరుశనగ పైరు, బాపనదొడ్డి సమీపంలో ఆముదం పంట ఇలా..

ఖరీఫ్ కలవరం

కృష్ణగిరి: మండలంలో నెలన్నర రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో ఖరీఫ్‌లో వర్షాధారం కింద పంటలు సాగుచేసిన అన్నదాతలు కలవరం చెందుతున్నారు. కళ్ల ముందే పంటలు ఎండుతుండడంతో దిక్కుతోచని స్థితిలో తల్లడిల్లిపోతున్నారు. మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ దాదాపు వాడుముఖం పట్టాయి. అయినా వర్షం రాకపోతాదా పంటలకు జీవం పోయదా అని కళ్లు కాయలు కాసేలా ఆకాశం వైపు చూస్తున్నారు. ఏ గ్రామం వెళ్లినా వాడుపట్టిన పంట పొలాలు, కళ తప్పిన అన్నదాత ముఖాలే దర్శమిస్తున్నాయి. గ్రామా గ్రామాన వరుణదేవుడి కటాక్షం కోసం చేయని పూజలు లేవు, మొక్కని దేవుడు లేడు. గత నాలుగు రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు మండుతున్నాయి. మరో 10 రోజులు ఇలాగే కొనసాగితే ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం తప్పదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ ఇవ్వాలి



సబ్‌స్టేషన్ ముందు నిరసనలో పాల్గొన్న రైతులు

మద్దికెర: వ్యవసాయానికి పగటి విద్యుత్ ఇవ్వాలంటూ మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు రాత్రి సమయంలో కరెంట్ ఇవ్వడం వల్ల రాత్రి వేళ పొలాల్లో విష పురుగులు ఉంటాయని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అంతేగాక కూలీలు ఎవరూ పనులకు రారన్నారు. అధికారులు స్పందించి పగటి పూట కరెంటు ఇవ్వాలని కోరారు. విషయం తెలుసుకున్న ఈడీ రామకృష్ణ మద్దికెరకు చేరుకొని ఒకేసారి 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయడం వల్ల బోర్లు, బావుల్లో నీరు ఇంకిపోయి పంటలకు నీరు పెట్టడానికి అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని, రెండు పూటలు ఇవ్వడం వల్ల బోర్లలో నీరు చేరి మరిన్ని పంటలు సాగు చేయడానికి వీలుంటుందన్నారు. అయితే రైతుల కోరిక మేరకు పగటిపూట కరెంటు ఇస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. రైతులు చిరంజీవి, రామాంజులు, నాగప్ప, కొండారెడ్డి, బసప్ప పాల్గొన్నారు.

ఫాగింగ్ యంత్రాలు మూలకేనా?



తుగ్గలి ఎంపీడీఓ కార్యాలయంలో ఉంచిన ఫాగింగ్ మిషన్లు

తుగ్గలి: గ్రామ పంచాయతీల్లో దోమల నివారణ కోసం కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు ఆటకెక్కాయి. గ్రామాల్లో దోమల నియంత్రణకు దాదాపు ఏడు నెలల క్రితం ఫాగింగ్ యంత్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి పంపింది. అయితే అధికారుల నిర్ల క్ష్యం కారణంగా అవి ఇంతవరకు పంపిణీకి నోచుకోలేదు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గాని వాటిని తీసుకెళ్లా న్న ఆలోచన చేయడంలేదు.

ఒక్కో ఫాగింగ్ మిషన్ ధర రూ.49 వేలు

మండలంలో 40 గ్రామాలకు ఏడు నెలల క్రితం ఒక్కో మిషన్‌కు రూ.48,995 చొప్పున మొత్తం రూ.19.60 లక్షలు వెచ్చించి 40 ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. అయితే వాటిని పంచాయతీలకే చేర్చలేదు. ఐదారు గ్రామాలు మినహా మిగిలినవన్నీ ఎంపీడీఓ కార్యాలయంలోనే మూలనపడి ఉన్నాయి. గ్రామాల్లో దోమల వ్యాప్తి పెరిగి రోగాలు ప్రబలే అవకాశం నెలకొంది. వర్షాకాలం ప్రారంభమైనా గ్రామాల్లో ఎక్కడా ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి యంత్రాలను పంచాయతీలకు చేర్చి గ్రామాల్లో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అజాగ్రత్తగా ఉంటే ముప్పే

- క్రిమి సంహారక మందుల వినియోగంపై అవగాహన అవసరం
- పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యంపై దుష్ప్రభావం



పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతన్న

మద్దికెర: ఆధునిక వ్యవసాయ విధానంలో దిగుబడులను పెంచుకునేందుకు రసాయన ఎరువులు, క్రిమీ సంహారక మందుల వినియోగం పెరిగిపోయింది. ఎరువులు వేసే సమయంలో, క్రిమీ సంహారక మందులు స్ప్రే చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. వాటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు తదితర అంశాలను వివరిస్తూ రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రత్యేక పోస్టర్లను ఏర్పాటు చేశారు. రైతన్నలు వాటిని చదివి అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా మోనోక్రోటోఫాస్, ఆక్సిడిమోటాన్, మిథైల్, అసిఫేట్ తదితర విషపూరితమైన క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే సమయంలో వాటి వినియోగ విధానంపై కచ్చితంగా అవగాహన వుండాలని సూచిస్తున్నారు.

రసాయనాలు కలిపే విధానం

- సస్యరక్షణ చర్యల కోసం వినియోగించే పరికరాలను శుభ్రంగా ఉంచి నీటితో కడిగి, పొడిగుడ్డతో తుడిచి భద్రపరచుకోవాలి.
- అవగాహన ఉన్న రైతు సమక్షంలో మందులు కలపడం, పిచికారీ ప్రక్రియ చేపట్టాలి.
- ఎక్కువ ఉష్ణోగ్రత, ఎక్కువ గాలి ఉన్న సమయంలో క్రిమీ సంహారక మందులు పిచికారీ చేయరాదు.
- పిచికారీ చేసే సమయంలో మద్యం, పొగ తాగడం, పొగాకు, గుట్కా, తంబాకు, నమలడం వంటివి చేయరాదు.
- నిషేధిత పురుగు మందులను వినియోగించరాదు. ఒక్కోసారి డీలర్లు వాటిని రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తుంటారు.
- వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో మందులను కొనుగోలు చేయడం ఉత్తమం.
- మితిమీరిన పురుగు మందులు, రసాయనాల వినియోగం వల్ల నేల, నీరు, గాలి, పర్యావరణం కాలుష్యమై పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. పురుగు మందులు, రసాయనాలకు ప్రత్యామ్నాయంగా ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు పద్ధతులపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు వహించాలి



పంటను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు క్రిమీ సంహారక మందుల వినియోగం తప్పనిసరైందే. అయితే వాటిని వినియోగించే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, లేదంటే వాటి ప్రభావం ఆరోగ్యంపై పడే ప్రమాదం ఉంది. నిర్లక్ష్యం వహిస్తే ఒక్కోసారి ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. – రవి, ఏఓ, వ్యవసాయ శాఖ







పూజలందుకున్న చింతలముని, నల్లారెడ్డి స్వామి, తంగరడోణలో స్వామివారి అశ్వాన్ని ఊరేగిస్తున్న భక్తులు, గోనెగండ్లలో అశ్వాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా దశమి ఉత్సవాలు

ఆస్పరి: ఆస్పరి మండలంలోని తంగరడోణలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులతో తంగరడోణ గ్రామం కిటకిటలాడింది. స్వాముల ఆలయాలు వద్ద టెంకాయలు పేలుస్తూ ఉత్సవాలను సంబరంగా చేసుకున్నారు. స్వామి వారి ఆలయాల్లో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మొదట గ్రామంలో వెలసిన చింతలముని ఆలయం నుంచి ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు స్వాముల అశ్వంతో పాటు చింతలముని, ఓబులేషు, బాలముని స్వాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా రెండు కిలోమీటర్ల దూరంలో కొండల్లో వెలసిన నల్లారెడ్డి స్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ నల్లారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేసి తిరిగి ఊరేగింపుగా చింతలముని స్వామి ఆలయం చేరుకున్నారు. ఊరేగింపులో అడుగడుగునా స్వామివారి అశ్వానికి భక్తులు బిందెలతో నీళ్లు పోసి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పార్వతి, సర్పంచ్ శంకరమ్మ, గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న, రంగన్న, దస్తగిరి, మాబుసాబు, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వామి చిన్న దశమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున దేవాలయ అర్చకులు, పీఠాధిపతులు, చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారిని వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. జలాభిషేకం, తులసిఅర్చన, ఆకుపూజ, మహామంగళహారతి నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి అశ్వాన్ని ఓబులేషు స్వామి ఆలయం నుంచి చింతలాముని, నల్లారెడ్డి దేవాలయం వరకు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. అలాగే ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి మేళతాళలతో వైభవంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు.